ఏర్పాట్ల పరిశీలన

మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ ప్రజాదీవెన సభలో పాల్గొననున్నందున కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఎంవీఎస్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు పర్యవేక్షించారు. సభకు జనం అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులతో చర్చించారు. స్టేడియం మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజాదీవెన సభ పోస్టర్ ఆవిష్కరణ

సీఎం ప్రజాదీవెన సభ పోస్టర్‌లను డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదీవెన సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తొలిసారి జిల్లాకు వస్తున్నందున పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని ప్రజలను కోరారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, సీజే బెనహర్ పాల్గొన్నారు.

నేడు పాలమూరుకు..
సీఎం రాక

- భారీ బహిరంగ సభ వేదికగా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రకటన
- అభ్యర్థిగా ఇప్పటికే మన్నె జీవన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారు
- పార్లమెంట్ ఎన్నికలకూ ఇక్కడి నుంచే శంఖారావం
- ముఖ్యమంత్రి ఇన్‌చార్జిగా ఉండటం.. సొంత జిల్లా కావడంతో ప్రత్యేక దృష్టి



సీఎం సభ కోసం చేస్తున్న ఏర్పాట్లు

మహబూబ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం పాలమూరుకు రానున్నారు. ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచారాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించనున్నారు. సీఎం అయిన తర్వాత మొదటిసారి కోస్గిలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వస్తున్నారు. దాంతో ఎంవీఎస్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి సాయంత్రం నాలుగు గంటలకు రానున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు ఉండగా.. ఒక స్థానంలో కసిరెడ్డి నారాయణరెడ్డి, మరో స్థానంలో కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కసిరెడ్డి నారాయణరెడ్డి.. ఆ పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత తన ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి ఫిబ్రవరి 26న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగా.. సోమవారం నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఈ నెల 28న పోలింగ్ జరగనుంది. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు ఈ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. రెండు సార్లూ ఏకగ్రీవం అయ్యారు. దీంతో ఎన్నికకు అవకాశం లభించలేదు. అయితే ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, సమీపంలో పార్లమెంట్ ఎన్నికలు ఉండటం, సీఎం సొంత జిల్లా కావడంతో కచ్చితంగా ఈ స్థానాన్ని గెలుచుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం బీఆర్ఎస్‌కే ఎక్కువ బలం ఉంది. రెండో స్థానంలో కాంగ్రెస్, మూడో స్థానంలో బీజేపీ ఉన్నాయి. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ నుంచి మెజారిటీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేలు పలు మునిసిపాలిటీల్లో అవిశ్వాసం నెగ్గేలా చేసుకోవడంతో పాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులను పార్టీలో చేర్చుకుంటున్నారు. అయితే ఈ ఎన్నికల్లో పోటీపై బీజేపీ ఆలోచించడం లేదు. కేవలం బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర స్వతంత్రులు మాత్రమే పోటీచేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ తరఫున ఇప్పటికే సూత్రప్రాయంగా మన్నె జీవన్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. బుధవారం జరిగిన పాలమూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ఇక బీఆర్ఎస్ అభ్యర్థి కోసం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశమైన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. చర్చలు జరిపారు. అధికారికంగా అభ్యర్థి ఖరారు కాకపోయినప్పటికీ.. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల తరఫు నుంచి కూడా ఆయనకు మద్దతు ప్రకటనలు వెలువడుతున్నాయి. ఆల మొదట ఎంపీగా పోటీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. మహబూబ్‌నగర్ నుంచి ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డినే మరోసారి తమ అభ్యర్థిగా మాజీ సీఎం కేసీఆర్ మంగళవారం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయడం ఖాయంగానే కనిపిస్తోంది.

విజయం ప్రతిష్ఠాత్మకం..

ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుకు వేసి.. ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల ముంగిట ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుండటంతో.. ఈ గెలుపుఓటముల ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై పడే అవకాశం ఉంటుంది. అలాగే అసెంబ్లీ ఎన్నికల జోష్‌ను పార్లమెంట్ వరకు కొనసాగించాలంటే ఈ గెలుపు కాంగ్రెస్ పార్టీకి చాలా అవసరం. సీఎం సొంత జిల్లా కావడంతోపాటు.. పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఆయనే ఉండటంతో ముందస్తుగానే కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేసుకుంటోంది. దాంతో మొన్నటి వరకు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులను చేర్చుకోబోమని ప్రకటించిన ఎమ్మెల్యేలు సైతం ప్రస్తుతం చేరికలను ప్రోత్సహిస్తూ.. బలం పెంచే పనిలో పడ్డారు. జీవన్‌రెడ్డి కూడా ఉమ్మడి జిల్లా నాయకులకు, ప్రజాప్రతినిధులకు సుపరిచితుడు కావడం, ఎంపీ, అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో గతంలో బీఆర్ఎస్ గెలుపులో కీలకపాత్ర పోషించడంతో మంచి పేరు ఉంది. ఈ నేపథ్యంలోనే సీఎం ఆయన్ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఆయన ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటారనే ప్రచారం కూడా జరిగింది.



మహబూబ్‌నగర్ ఎంవీఎస్ కళాశాల మైదానంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, పాలమూరు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

కానీ మొదటి నుంచి ఈ పార్లమెంట్ స్థానంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి వర్క్ చేసుకుంటుండటంతో ఆయన పేరునే సీఎం కోస్గి సభలో ప్రకటించారు. అలాగే బుధవారం జరిగే సభలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డితోపాటు పలువురు ఎంపీ అభ్యర్థులను కూడా అధికారికంగా ప్రకటించి, పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పలువురు ఎంపీ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా కల్వకుర్తి జడ్పీటీసీ సభ్యుడు, ప్రస్తుత ఎంపీ రాములు తనయుడు భరత్ పేరును ఖరారు చేయగా.. బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేరునే ప్రకటించింది. బీజేపీ మహబూబ్‌నగర్ అభ్యర్థిని, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. నాగర్‌కర్నూల్ నుంచి బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుండగా.. బీఆర్ఎస్‌తో పొత్తు ఖరారైనట్లు బీఆర్ఎస్, బీఎస్పీ అధ్యక్షులు ప్రకటించారు. దీంతో ఆయన ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉండటం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు వంశీచంద్‌రెడ్డి పేరు ఖాయంగానే కనిపిస్తోంది. కానీ నాగర్‌కర్నూల్ నుంచే ముగ్గురు టికెట్ ఆశిస్తున్నారు. మరీ బుధవారం సభలో సీఎం రేవంత్ ఎన్ని పేర్లు ప్రకటిస్తారో వేచి చూడాలి.

అభివృద్ధికి జోడెద్దుల్లా పని చేస్తాం

- న్యాయయాత్ర ముగింపు సభలో వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్: 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. తనను పార్లమెంట్ సభ్యుడిగా గెలిపిస్తే.. ఇద్దరం కలిసి జోడెద్దుల్లా పాలమూరు అభివృద్ధి కోసం పని చేస్తాం' అని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ పరిధిలో వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్ర మంగళవారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ పరిధిలో ముగిసింది. వన్‌టౌన్ చౌరస్తా రాంమందిర్, పాన్ చౌరస్తా మీదుగా గడియారం చౌరస్తా చేరుకు యాత్ర చేరుకుంది. అక్కడ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ భారత సమైక్యత కోసం రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా భారత్‌జోడో యాత్ర చేపట్టారన్నారు. రాహుల్ గాంధీ మక్తల్‌లో పాదయాత్ర ప్రారంభించి, షాద్‌నగర్ వరకు చేపట్టారని.. ఆయన ఎక్కడ కాలు పెడితే అక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. అందుకే మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి, రాహుల్‌గాంధీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే రేపు ఢిల్లీ నుంచి పెద్దఎత్తున నిధులు తెస్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి, వసంత, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, షబ్బీర్‌అహ్మద్, అవేజ్ పాల్గొన్నారు.

నిట్ హామీపై ఆశలు..

సీఎం మహబూబ్‌నగర్ పర్యటన నేపథ్యంలో నిట్ కళాశాల హామీపై ఆశలు నెలకొన్నాయి. ఇప్పటికే నిట్ ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు సీఎంకు విన్నవించారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా వినతిపత్రాలు ఇవ్వడంతో సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రాష్ట్రంలో వరంగల్‌లో మాత్రమే నిట్ కేంద్రం ఉండగా.. ఇక్కడ రెండోది ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. ఇప్పటికే వనపర్తిలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు కాగా.. కొడంగల్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీకి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి సీఎం కేసీఆర్ మహబూబ్‌నగర్‌కు జేఎన్‌టీయూ కాలేజీ మంజూరు చేసినప్పటికీ.. ఇప్పుడు అంతకంటే ప్రతిష్ఠాత్మకమైన నిట్ కళాశాల రావడానికి అవకాశాలు ఉన్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో ఆయన నుంచి ఈ హామీ పొందాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.

బీఆర్ఎస్ మహబూబ్‌నగర్
ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 5: మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఆ పార్టీ మళ్లీ టికెట్ ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రకటించారు. దీంతో ఎంపీ అభ్యర్థి ఎవరనే ఊహాగానాలకు తెరదించారు. ఈ టికెట్‌పై కొద్దిరోజులుగా రకరకాల ప్రచారాలు జరిగాయి. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి పేర్లు వినిపించినా.. కేసీఆర్ చివరకు మన్నె వైపే మొగ్గు చూపారు. ఎంపీ సోదరుడి కుమారుడు మన్నె జీవన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరడం, ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఆయనకే టికెట్ ఖరారు కావడంతో మన్నె శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ వస్తుందా? లేదా? అన్న చర్చ సాగింది. చివరకు అధిష్ఠానం ఆయనకే టికెట్ ఇచ్చింది. గత ఎన్నికల్లో పోటీ చేసిన మన్నె శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ అభ్యర్థి డీకె అరుణపై 80 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ఎండినది



నీరందక ఎండిన వరి పైరు



నీళ్లు లేక ఒట్టిపోయిన భీమా నది

- నీళ్లు లేక ఒట్టిపోయిన భీమా
- నది పరివాహక ప్రాంతాల్లో ఎండుతున్న వరి
- ఎగువ కర్ణాటక ప్రాజెక్టులతో నీటి కట్టడి

నారాయణపేట, మార్చి 5: జిల్లాలో భీమా నది ఒట్టిపోయింది. ఎగువన కర్ణాటక రాష్ట్రంలో ఈ నదిపై గూడూరుతో పాటు పలు ప్రాజెక్టులతో నీటిని కట్టడితో చేయడంతో నదిలో దిగువకు నీరు రావడం లేదు. ఈసారి వర్షాభావ పరిస్థితులతో పాటు మార్చిలోనే ఎండలు అధికంగా ఉండటంతో కర్ణాటక ప్రాంతం నుంచి దిగువ ప్రాంతమైన తెలంగాణకు నది జలాలు రావడం లేదు. కర్ణాటక ప్రాజెక్టుల అడ్డుకట్టలతో నది ఎండింది. ఈ యాసంగిలో భీమా నది పరివాహక ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేశారు. నది ఎండటంతో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని కృష్ణా మండలం తంగిడిగి, చాకలూరు లింగంపల్లి, కుసుమూర్తి ప్రాంతాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి సాగు చేశారు. నదిలో నీరు పూర్తిగా ఎండగా, అక్కడక్కడ మడుగుల్లో ఉన్న నీటిని మోటార్ల సాయంతో పంటలకు పారిస్తున్నారు. ఇప్పటికే అధిక మొత్తంలో పంటలు బీటలు ఎండిపోయాయని, అధికారులు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి గూడూరు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు వదిలేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కుసుమూర్తి గ్రామానికి చెందిన రైతు నరేష్ మాట్లాడుతూ 53 ఎకరాల్లో వరి సాగు చేశానని, అప్పులు చేసి పెట్టుబడి పెట్టగా.. నీరందక పంట ఎండిపోయే ప్రమాదంలో పడిందన్నారు. మరో రైతు కుర్వ లక్ష్మణ్ మాట్లాడుతూ పదెకరాల్లో వరి సాగు చేశానని, నీళ్లు లేక పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బడిగేరి బస్వరాజు మాట్లాడుతూ 12 ఎకరాల్లో వరి సాగు చేయగా.. మూడు ఎకరాల్లో ఎండిపోయిందన్నారు. అధికారులు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి పంటలను బతికించాలని కోరుతున్నారు.

అడుగంటిన తుంగభద్ర

- మినీ ఎత్తిపోతల నుంచి అందని సాగునీరు
- నాలుగువేల ఎకరాల్లో ఎండుతున్న పంటలు



తుంగభద్ర నదిలో అడుగంటిన నీరు

వడ్డేపల్లి: తుంగభద్ర నది అడుగంటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నది వెంట ఉన్న మినీ ఎత్తిపోతల పథకాలను నమ్ముకుని జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు 1, 2, టీ.గార్లపాడు, పి.గార్లపాడు, మద్దూరు ఎత్తిపోతల పథకాల కింద నాలుగు వేల ఎకరాల్లో మిరప, మొక్కజొన్న, కంది, కొర్ర పంటలను సాగు చేశారు. ఏటా మార్చి వరకు పంటలకు నీరు పుష్కలంగా అందేది. కానీ ఈ ఏడాది జనవరి చివరి నుంచే పథకాలకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. రెండు తడులు నీరందితే పంటలు గట్టెక్కుతాయని అంటున్నారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో 8.9 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. సుంకేసుల బ్యారేజీలో 0.177 టీఎంసీల నీరుంది. ఆ నీటిని వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీటి కోసం వాడుతున్నామని ఏఈ సతీష్‌బాబు చెబుతున్నారు. రైతులు ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసుకోవాలని సూచించారు.

రేపు గవర్నర్ రాక

- అలంపూర్ ఆలయాలను దర్శించుకోనున్న తమిళిసై సౌందర రాజన్

అలంపూర్ చౌరస్తా, మార్చి 5 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జోగుళాంబ అమ్మవారిని ఈనెల ఏడో తేదీన రాష్ట్ర గవర్నర్ తమిళిసై దర్శించుకోనున్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధి కోసం ప్రసాద్ స్కీంలో భాగంగా రూ.36.70 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా సుమారు రూ.20 కోట్లతో రెండేళ్లపాటు నిర్మించిన ఫెసిలిటీ సెంటర్‌ను ఈనెల ఏడున ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కార్యక్రమాన్ని గవర్నర్ ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. ఆమెతో పాటు, టూరిజం చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ మోయినుద్దీన్, కలెక్టర్ సంతోష్ తదితర అధికారులు వీక్షించనున్నారు. అనంతరం ఆమె ఆలయాలను సందర్శించనున్నారని టూరిజం డిప్యూటీ ఇంజనీర్ ధన్‌రాజ్ తెలిపారు.

దాహార్తిలో వన్యప్రాణులు

- నల్లమల అడవిలో ఎండిన చెరువులు, కుంటలు, వాగులు
- ఈ ఏడాది వర్షాభావంతో తగ్గిన నీరు
- ట్యాంకర్ల ద్వారా నీటిని ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు



సాసర్ పిట్లలో నీటిని నింపుతున్న అధికారులు



నల్లమలలో ఎండిన చెట్లు



నల్లమల అడవిలోని కుంటలో నీరు తాగుతున్న జింకలు



నీళ్లు తాగుతున్న దున్నపోతు

అచ్చంపేట, మార్చి 5: వేసవికి ముందే నల్లమల అడవిలో నీళ్లు లేక వన్య ప్రాణులు అలమటిస్తున్నాయి. నల్లమలలోని చెరువులు, కుంటలు, జలపాతాలు, గుండాలు, చెలిమెలు చుక్క నీళ్లు లేక ఒట్టిపోయాయి. దేశంలోని రెండో అతిపెద్ద అభయారణ్యం నల్లమల.. ఎన్నో రకాల వన్య ప్రాణులకు జీవనాధారం. ఈ అడవిలో పెద్ద పులులు మొదలుకొని చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, అడవి కుక్కలు, జింకలు, సాంబర్లు, మనుపోతులు, పందులు ఉన్నాయి. వీటితో పాటు కోతులు, దుప్పులు, ముళ్లపందులు, చౌసింఘాలు, ఇంకా ఎన్నో రకాల వన్య ప్రాణాలకు నిలయంగా మారింది. అయితే గతేడాది కంటే ఈ ఏడాది తీవ్ర వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో అడవిలో నీరు దొరకడం లేదు. ఫిబ్రవరి నుంచే భగభగ మండే ఎండలకు వృక్షాలు సైతం మోడుబారిపోతున్నాయి. ఉబికివచ్చే చెలిమలు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో గుక్కెడి నీటి కోసం వన్య ప్రాణులు అల్లాడుతున్నాయి.

నల్లమలలో నీరు లభించే ప్రాంతాలు

నల్లమల అభయార్యణంలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మొదలుకొని.. అచ్చంపేట నియోజకవర్గం నాగార్జున సాగర్ వరకు దాదాపు 120 కిలో మీటర్ల మేర కష్ణానది నీరు లేక ఎండిపోయింది. దాంతో పాటు నల్లమలలో రసూల్ చెరువు, బౌరాపూర్ చె రువు, నల్ల వాగు, మానుపడ్డ వాగు, బుగ్గ వాగు, కాగిరెట్టి వాగు, పొగనూరి వాగు, మక్కలేరు, ఎములపయ్య వాగు, పలంకోలువ వాగులు ఒట్టిపోయాయి. అదే విధంగా డిండి రిజర్వాయర్, మల్లెల తీర్థం, లొద్ది, సలేశ్వరం గుండం వణ్య ప్రాణులకు నీటి వనరులుగా ఉండేవి. వాగులు, వంకలు, జలాశయాల్లోనూ నీళ్లు లేకపోవడంతో వన్య ప్రాణులు దాహార్తితో అలమటిస్తున్నాయి.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం

నల్లమలలో వన్య ప్రాణులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా 1,150 సాసర్ పెట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా నింపుతున్నాం. 80కి పైగా పర్కులేషన్ ట్యాంక్‌లు ఉన్నాయి. సాసర్ల వద్ద జంతువులకు న్యూట్రిషన్ కోసం ఉప్పు గడ్డలను ఉంచుతున్నాం.

– అదిత్య, ఫారెస్ట్ రెంజ్ అధికారి







మహబూబ్‌నగర్ ఆర్టీసీకి రెండవ బెస్ట్ రీజియన్ అవార్డు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 5 : మహబూబ్‌నగర్ ఆర్టీసీకి రెండవ బెస్ట్ రీజియన్ అవార్డు రావడం సంతోషంగా ఉందని రీజనల్ మేనేజర్ శ్రీదేవి పేర్కొన్నారు. ఈ అవార్డు రావడం వెనుక జిల్లాలోని రీజియన్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో పాటు డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఉందని అన్నారు. ప్రయాణికులందరికి ఆర్ఎం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అవార్డును ఈనెల ఏడో తేదీన హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో అందజేస్తారని ఆర్ఎం వివరించారు.

యువతి అదృశ్యం

కొత్తకోట, మార్చి 5 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. యువతి(19) సోమవారం బర్రెలను మేతకు తీసుకెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఆ చూకీ కోసం వెతికారు. యువతి జాడ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


తిమ్మాజిపేటలో వ్యక్తి..

తిమ్మాజిపేట, మార్చి 5 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటకు చెందిన ఆరెకటిక శ్రీనివాస్(54) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఏఎస్సై ఉమెన్స్ ప్రిస్సిల్ల తెలిపారు. గత నెల 28న ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాలేదని, ఆచూకీ కోసం వెతికినా జాడ కానరాకపోవడంతో కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

బైకు, కారు ఢీ

» ఒకరి మృతి, నలుగురికి గాయాలు

మిడ్జిల్, మార్చి 5 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండకు చెందిన జంగారెడ్డి(60) మిడ్జిల్ నుంచి ఉర్కొండ మండల కేంద్రానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన కారు డ్రైవర్ కార్తీక్ కల్వకుర్తి నుంచి కారులో మరో ముగ్గురితో కలిసి జడ్చర్ల వైపు వస్తున్నాడు. మిడ్జిల్-ఉర్కొండ మండలాల సరిహద్దులో కారు, బైక్ ఢీకొనడంతో జంగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న డ్రైవర్ కార్తీక్‌తో పాటు, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి, మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.















డిజిటల్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, తదితరులు

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు వారిష్టం

మోదీని రేవంత్ పెద్దన్న అంటే కలిసిపోయినట్టేనా?: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు వారి ఇష్టం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని రేవంత్‌రెడ్డి పెద్దన్న అని పిలిస్తే.. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైపోయినట్టేనా? అలా ఎందుకు పిలిచారో ఆయన్నే అడగాలని మీడియాకు సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రెండు డిజిటల్ క్యాంపెయిన్లను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి మోదీ చేస్తున్న కృషిని వివరించడమే లక్ష్యంగా 'మన మోదీ' క్యాంపెయిన్ చేపట్టనున్నామని తెలిపారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, మౌలికవసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను 6 గ్యారెంటీల అమలుపై నిలదీస్తూ 'ప్రశ్నించే తెలంగాణ' పేరిట క్యాంపెయిన్‌ను చేపట్టనున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు.

రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే!

- కాంగ్రెస్‌ను బొంద పెడతారు
- ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్తారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సిరిసిల్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్‌షిండేలా, హిమంతబిశ్వశర్మలా మారటం ఖాయమని, ఎన్నికల తర్వాత బీజేపీలో చేరి కాంగ్రెస్‌ను బొంద పెడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి మహారాష్ట్ర, అస్సాంలో జరిగినట్లే జరుగుతుందన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌తోపాటు ముస్తాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. 2014 నుంచి 2021 వరకు ప్రధాని మోదీని తాము ఎంతో గౌరవించామని, రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా ఘనంగా స్వాగతించామని.. అయినప్పటికీ ఆయన మొండి చేయి తప్ప ఏమీ ఇవ్వడని తెలుసుకున్నామన్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మోదీని బుట్టలో వేసుకోవడానికి, మస్కా కొట్టడానికి బడాభాయ్, చోటా భాయ్ అని మాట్లాడటం చూస్తే ఆయనేం చేయడు, ఈయనేం చేయడని అర్థమైందని ఎద్దేవా చేశారు. ఆత్మగౌరవం ఉన్న తెలంగాణ బిడ్డ ఎవరైనా తెలంగాణ మాడల్ గురించి చెబుతారు కానీ గుజరాత్ మాడల్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తి సీఎం కావడం మన కర్మ అని ప్రజలు భావిస్తున్నారని విమర్శించారు. రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండగా బడాభాయ్ ఆశీర్వాదం భవిష్యత్‌లో ఉండాలని రేవంత్‌రెడ్డి కోరుకోవడం చూస్తే.. 'రాహుల్‌గాంధీ గెలిచేది లేదు. పీకేది లేదు. ఎన్నికల తర్వాత కూడా నువ్వే ప్రధాని' అని మోదీకి చెప్పినట్లు కాదా? అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి, మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవరూ ఇలా మాట్లాడరని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ లక్షల కోట్లు తిన్నారని ముఖ్యమంత్రి నుంచి కింద ఉన్న కాంగ్రెస్ సన్నాసుల వరకు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని.. మేడిగడ్డ 85 పిల్లర్లలో ఒక్కటి కుంగిందని, కేసీఆర్ ఉంటే కాపర్ డ్యాం కట్టి మిగతా నీళ్లు అటు పోకుండా చూసేవారని, ఒక పంప్‌తోనైనా నీళ్లు నింపేవారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ఆ తెలివి లేదన్నారు. ప్రతిరోజూ 5 వేల క్యూసెక్కుల నీళ్లు కిందకు పోతున్నా చూస్తున్నారన్నారు. కాళేశ్వరం వల్ల మంచి జరిగితే కేసీఆర్‌కు పేరు వస్తుందని, పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వచ్చి 90 రోజులే అవుతోందని.. కానీ, 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చానని చెప్పుకోడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన వారికి కూడా తేలుకుట్టిన దొంగ లెక్క అయ్యిందని.. చెప్పుకుంటే ఇజ్జత్ పోతుంది అన్నట్టుగా, ఓటు వేసి మోసపోయామని అనుకుంటున్నారని తెలిపారు. ఎంపీ బండి సంజయ్.. అమిత్‌షా చెప్పులు మోయడం తప్ప ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. మోదీ కూడా దేశానికి ఏం చేశారో ఎవరికీ తెలియదని, ద్వారకలో మాత్రం నీళ్లలో మునిగి ఏదో చేశాడని ఎద్దేవా చేశారు.



పార్టీ వీడిన వారిని మళ్లీ తీసుకోం

అవకాశవాదులు వస్తుంటారు.. పోతుంటారు.. పార్టీ ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండాలి

- అసెంబ్లీ ఎన్నికల్లో ఈ తీర్పును ఊహించలేకపోయాం: కేసీఆర్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్‌ను వీడి.. ఇతర పార్టీల్లో చేరుతున్న వారిని మళ్లీ పార్టీలోకి తీసుకోబోమని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఉద్యమ పార్టీగా మొదలై, రాష్ట్రాన్ని సాధించి.. అధికారం చేపట్టిన బీఆర్ఎస్‌లో పలువురికి రాజకీయ భవిష్యత్తు దక్కిందని, కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు పార్టీని వీడటం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలతో తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ భేటీలోనే మహబూబ్‌నగర్ అభ్యర్థిగా సిటింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేరును ప్రకటించారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఎవరనేది త్వరలో పార్టీ ముఖ్యులతో చర్చించి వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఇలా ఉంటుందని ఊహించలేకపోయామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఎంతో చేశామని, అయినా అక్కడ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వలసలు అధికంగా ఉండే ఆ జిల్లాలో తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చిందని, వివిధ రంగాల్లో పురోభివృద్ధి సాధించామని, అక్కడ బీఆర్ఎస్ ఓడాల్సింది కాదని అన్నారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను తాము అధికశాతం పూర్తిచేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కాల్వల నిర్మాణం పూర్తిచేయడం, నీళ్లు ఇవ్వడమే మిగిలి ఉందని చెప్పారు. సందర్భంగా.. కష్టకాలంలో పార్టీ నుంచి వెళ్తున్న వారిని మళ్లీ చేర్చుకోవద్దని కొందరు నేతలు కోరగా..



బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

వారిని మళ్లీ తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుకు ఏం తక్కువ చేశాం? రాములుతోపాటు ఆయన కుమారుడికీ పార్టీ అవకాశాలు కల్పించింది. ఇలాంటి అవకాశవాదులు వస్తుంటారు.. పోతుంటారు. దానిని మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదు. గెలిచినా, ఓడినా.. మనం, మన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండేలా చూడాలి" అని పార్టీ నేతలతో కేసీఆర్ అన్నారు.

కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చి..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు అలవికాని హామీలిచ్చి.. వెనకా ముందు చూడకుండా ప్రజల్లో ఆశలు రేకెత్తించారని కేసీఆర్ విమర్శించారు. నిన్నటిదాకా ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు హామీల అమలుపై నాలుక మడతపెట్టి తిట్లకు దిగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా హామీలిచ్చి.. ఇప్పుడు ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వ అనాలోచిత చర్య అన్నారు. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని నమ్మి ఓట్లేసిన వారికి ఇప్పుడిప్పుడే వాస్తవాలు తెలుస్తున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని పక్కనపెట్టి.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమిష్టి కృషితో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఈ పొత్తు ద్వారా దళిత, బహుజనులను మరింత చేరువ చేసుకోగలమని అభిప్రాయపడ్డారు. ఒకటి, రెండు ఎంపీ స్థానాలను బీఎస్పీకి ఇచ్చినా.. రెండు పార్టీల సమన్వయంతో అభ్యర్థులను గెలిపించుకోవచ్చన్నారు.

నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్?

బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు కుదిరిన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీచేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉన్న పోతుగంటి రాములు ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి.. తన కుమారుడు భరత్ ప్రసాద్‌తో కలిసి బీజేపీలో చేరడం, వెంటనే ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా భరత్‌ను ప్రకటించడం తెలిసిందే. దీంతో అక్కడ బీఆర్ఎస్ తరఫున పోటీ చేయడానికి సరైన అభ్యర్థి లేకుండా పోయారు. తాజాగా బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తుతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేరు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సొంత జిల్లా కావడంతో ఆయన కూడా పోటీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అర్హులందరికీ 'ఉచిత విద్యుత్' ఇవ్వండి

- 60 లక్షల కుటుంబాలు స్కీంకు దూరం
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ లేఖ

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రేషన్‌కార్డు ఉన్న అన్ని కుటుంబాలకూ వర్తింపజేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు.. సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. ప్రభుత్వం 30 లక్షల కుటుంబాలకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. దీంతో మిగిలిన 60 లక్షల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో 30 లక్షల పేద కుటుంబాలకు గాను 10 లక్షల కుటుంబాలకు ఈ పథకం అమలు చేయాలని నిర్ణయించారని.. దీంతో మిగతా వారికి నష్టం కలుగుతోందని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమైతే.. 90 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారని, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా బిల్లు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది సరికాదని, 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి.. అదనంగా వినియోగించిన యూనిట్ల ధరను ప్రజల నుంచి వసూలు చేయాలని సూచించారు. ఒక రేషన్ కార్డులో పేరు ఉన్న వారు రెండు, మూడు కుటుంబాలుగా విడిపోయి బతుకుతున్నారని, వారందరినీ ఒకే కుటుంబంగా లెక్కించడం సరైన పద్ధతి కాదన్నారు. ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపచేయాలని హరీశ్ రావు కోరారు.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ధర్నాలు నేడు

తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్(లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలతోపాటు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని పేర్కొంది. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ఎల్ఆర్ఎస్ అనుమతులు ఇవ్వాలని గురువారం కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇస్తామని బీఆర్ఎస్ ప్రకటించింది.

అరూరి రమేశ్ యూటర్న్!

- కేటీఆర్, హరీశ్‌రావుతో ఫలించిన చర్చలు
- పార్టీ మారడం లేదంటూ వీడియో సందేశం
- వరంగల్ ఎంపీ టికెట్‌పై కేసీఆర్ హామీ!



వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ యూటర్న్ తీసుకున్నారు. తాను పార్టీ మారుతున్నానని, బీజేపీలో చేరుతున్నానంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను పార్టీ మారడం లేదని, తనపై ప్రత్యర్థి పార్టీలు కుట్రతో దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొంటూ రమేశ్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట స్థానంలో ఓటమిపాలైన అరూరి రమేశ్.. పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేయాలని భావించారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి తనకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే కేసీఆర్ నుంచి ఎలాంటి హామీ లభించకపోగా, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్యను ఎంపీ బరిలో దింపుతున్నారనే ప్రచారం జరిగింది. దీంతో అసంతృప్తితో ఉన్న అరూరికి బీజేపీ పెద్దల నుంచి ఎంపీగా పోటీ చేయాలనే ఆఫర్ వచ్చినట్లు ప్రచారం జరిగింది. రమేశ్ తన ముఖ్య అనుచరులతో కలిసి ఐదారు రోజులుగా సంప్రదింపులు కూడా జరిపారు. బీజేపీలో చేరేందుకు అరూరి సిద్ధమైన విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆయనతో సంప్రదింపులు జరిపారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా నేరుగా చర్చలు జరిపినప్పటికీ ఆయన ససేమిరా అన్నారు. అయితే సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లిన అరూరి రమేశ్‌తో కేటీఆర్, హరీశ్‌రావు మరోసారి విడివిడిగా చర్చలు జరపడంతో ఆయన యూటర్న్ తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. వరంగల్ ఎంపీ టికెట్‌పై కూడా గులాబీ అధిష్ఠానం నుంచి హామీ లభించినట్లు సమాచారం.

కారెక్కిన ఏనుగు!

(మొదటిపేజీ తరువాయి)



పొత్తు ప్రకటన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న కేసీఆర్, ప్రవీణ్‌కుమార్

రెండు పార్టీల మధ్య సర్దుబాటు, బీఎస్పీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించాల్సిన స్థానాలపై మంతనాలు జరిపినట్లు సమాచారం. ఇద్దరు నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో మంగళవారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ ప్రతినిధుల బృందం నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకుని ఆయనతో చర్చించారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి పొత్తు విషయాన్ని ప్రకటించారు. కాగా, పొత్తులో భాగంగా ప్రవీణ్‌కుమార్‌కు నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఎన్నికల ప్రచారంలో ఇరు పార్టీల నేతలు కలిసి పాల్గొనాలని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్, బీఎస్పీ శ్రేణుల మద్దతు తీసుకొని ముందుకు సాగాలనీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతోపాటు ఈ పొత్తు లోక్‌సభ ఎన్నికలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో కూడా రెండు పార్టీలు కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. చర్చల అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యూహంతో బీఎస్పీతో పొత్తు కుదుర్చుకున్నామని, చాలా అంశాల్లో కలిసి పనిచేస్తామని అన్నారు. సిద్ధాంతపరంగా రెండు పార్టీలు ఒకే రకంగా ఉన్నాయని, తాము అధికారంలో ఉన్నప్పుడు దళిత, బహుజనుల సంక్షేమం దృష్ట్యా.. దళిత బంధు సహా ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పొత్తుపై బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతితో ఇంకా మాట్లాడలేదని, ఆమెతో చర్చలు జరిపి స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రవీణ్‌కుమార్ ఎక్కడి నుంచి పోటీ చేయాలన్నది ఇంకా నిర్ణయించలేదన్నారు. పొత్తుకు సంబంధించి విధి విధానాలు, ఎన్ని సీట్లలో పోటీ చేయాలన్నది త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ప్రజల జీవితాలను బాగు చేసేందుకే: ప్రవీణ్‌కుమార్

తెలంగాణలో బీఆర్ఎస్, బీఎస్పీ స్నేహం ప్రజల జీవితాలను బాగు చేస్తుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో లౌకికవాదం ప్రమాదంలో ఉందని, బీజేపీ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, కాంగ్రెస్ కూడా బీజేపీలాగే ప్రవర్తిస్తోందని ఆరోపించారు. లౌకికవాదాన్ని నిరంతరం కాపాడిన నేత కేసీఆర్ మాత్రమేనని, అందుకే ఆయనతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పొత్తు విషయాన్ని తమ పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తామని, అధినేత్రి మాయావతితో కేసీఆర్ మాట్లాడాక సీట్ల సర్దుబాటుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి మూడు నెలలు కాకముందే నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంలో తీవ్ర విమర్శలు చేసిన బీఆర్ఎస్‌తోనే పొత్తు పెట్టుకోవడంపై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, తాను చేసిన వ్యాఖ్యలు అలాగే ఉంటాయన్నారు. బహుజనుల మీద ఎవరు దాడులు చేసినా.. అక్కడ తాను ఉంటానన్నారు. తాను వ్యక్తుల మీద పోరాటం చేయలేదని, ప్రజల హక్కులకు భంగం కలిగినపుడు మాత్రమే పోరాటం చేశానని అన్నారు.

ఎలా స్పందించాలో తెలియడంలేదు: ఆకునూరి

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలని బీఎస్పీ తీసుకున్న నిర్ణయంపై ఎలా స్పందించాలో తెలియడం లేదని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గత రెండేళ్లుగా బీఆర్ఎస్ గురించి చెప్పినవన్నీ తప్పులన్నట్లేనా? అప్పుడు దుర్మార్గుడిగా కనిపించిన కేసీఆర్.. ఇప్పుడు హీరో అయ్యారా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "గాడిద మీద ఎక్కినా.. మీరు ఎంపీ అవ్వాల్సిందేనా? రేపు బీఆర్ఎస్ కేంద్రంలో ఎవరికి మద్దతు ఇస్తుందో మీకు తెలియదా? రాజ్యాంగాన్ని ఎవరు రద్దు చేస్తారో మీకు తెలియదా? రాజకీయాల్లో విలువలు ఉండవనే వాదనను మీరు కూడా అనుసరిస్తారా? అన్యాయం పోలీస్ బాస్.. మీ స్టెప్ కరెక్ట్ కాదు. మిమ్మల్ని, మీ రాజకీయాలను చూశాక యువత ఇక ఎవరినీ నమ్మరు. సారీ మిస్టర్ ఆర్ఎస్పీ.. బీఎస్పీ" అని మురళి ట్వీట్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తుపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. నిన్నటిదాకా విమర్శలు చేసిన పార్టీతోనే పొత్తు పెట్టుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.





రేపే కాంగ్రెస్ తొలి జాబితా!

(మొదటి పేజీ తరువాయి)



చెబుతున్నారు. మహబూబ్‌నగర్‌లో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డే తమ అభ్యర్థి అని సీఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు. ఇక, మల్కాజ్‌గిరి సీటును సినీ హీరో అల్లు అర్జున్ మామ అయిన చంద్రశేఖర్‌రెడ్డికి, చేవెళ్ల సీటును వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి కేటాయించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. సికింద్రాబాద్‌లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నల్లగొండ సీటుకు మాజీ మంత్రి జానారెడ్డి లేదా.. ఆయన తనయుడు రఘువీర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనున్నట్లు సమాచారం. నిజామాబాద్ సీటును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. మెదక్‌లో ముదిరాజ్ సామాజిక వర్గ నేత నీలం మధు, జహీరాబాద్‌లో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ అభ్యర్థిత్వాలు ఖరారైనట్లేనని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పొన్నం ప్రభాకర్ కోసం హుస్నాబాద్ సీటును వదులుకున్న ప్రవీణ్ రెడ్డితోపాటు వెలమ సామాజిక వర్గ నేత రాజేందర్‌రావు పేర్లను కరీంనగర్ సీటు కోసం పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ నుంచి పార్టీ నేత మస్కతితోపాటు మరో మహిళ పేరు వినిపిస్తోంది. ఇక, వరంగల్ సీటును మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్న నేపథ్యంలో దొమ్మాట సాంబయ్య పేరు ఖరారయ్యే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ సీటు తనదేనని, సీఎం రేవంత్ సైతం తనకు హామీ ఇచ్చారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మీడియా ముఖంగానే చెబుతున్నారు. కానీ, ఆ స్థానం నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సైతం పోటీ పడుతున్నారు. పెద్దపల్లి నుంచి ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీతోపాటు మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ సుగుణ కుమారి పేరునూ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నేత పెర్క శ్యామ్ పేరు సైతం వినిపిస్తోంది. మహబూబాబాద్ సీటుకు బలరాం నాయక్, పార్టీ నేత విజయాభాయి అభ్యర్థిత్వాలు పరిశీలనలో ఉన్నాయి. కాగా, ఆదిలాబాద్ నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న సోయం బాపూరావుకు ఆ పార్టీ తొలి జాబితాలో సీటు దక్కని సంగతి తెలిసిందే. పూర్వాశ్రమంలో కాంగ్రెస్, టీడీపీల్లో పని చేసిన ఆయనను పార్టీలోకి తీసుకుని టికెట్ ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం లేదా భువనగిరి నుంచి పోటీ చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి కోరిన నేపథ్యంలో ఆ రెండు సీట్లకు అభ్యర్థుల ఎంపికను పెండింగ్‌లో పెట్టినట్లు చెబుతున్నారు. మరోవైపు.. ఖమ్మం సీటు కోసం ఉపముఖ్యమంత్రి భట్టి సతీమణి నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనయుడు యుగంధర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి రేసులో ఉన్నారు. అలాగే భువనగిరి సీటును టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశిస్తుండగా, తన భార్య అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారు. అలాగే, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్‌ను త్యాగం చేసిన పటేల్ రమేష్‌రెడ్డితోపాటు బీసీ కోటా కింద చనగాని దయాకర్‌గౌడ్ తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అచ్చంపేటటౌన్, మార్చి 5: హైదరాబాద్ రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో గిరిజన విద్యార్థులకు 1వ తరగతిలో ప్రవేశంకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వాసి అయి అర్హులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈ నెల 11తేది సాయంత్రం 5గంటలలోగా జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ నెల 14న విద్యార్థులకు లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని అయన తెలిపారు.

బాధితున్ని పరామర్శించిన ఎల్లేని

పెద్దకొత్తపల్లి, మార్చి 5 : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కిరణ్‌చారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన కిరణ్‌చారి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి చేరుకుని కిరణ్‌చారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేంద్రంను కలిసి కిరణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఎల్లేని సుధాకర్‌రావు కోరారు.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి, మార్చి 5 : కల్వకుర్తి పట్టణంలో సర్వే నెంబరు 746/ఈ/1లో అక్రమ వెంచర్లు సృష్టించి ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భవాన్ల మధుపై చర్యలు తీసుకోవాలని, ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, బాలునాయక్, రవీందర్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి రాంరెడ్డి, షానవాజ్‌ఖాన్, శ్రీధర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలో జీఎస్ఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని సర్వే నెంబరు 746/ఈ/1లో ఆరెకరాల భూమి ఉందని అందులో రెండెకరాలకు 2007లో గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారని పేర్కొన్నారు. అదే వెంచర్‌ను అనుసరించి ఉన్న నాలుగెకరాలను 2022లో నకిలీ లేఅవుట్‌ను సృష్టించి ప్లాట్లను ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ అక్రమ వెంచర్‌పై గతంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ అక్రమ లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్నామని ప్లాట్లు కొంటే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఉండవని కమిషనర్ తెలిపిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

అధికారులతో కుమ్మక్కైన భవాన్ల మధు ఆ వెంచర్‌లోని ప్లాట్లను అమ్మి సొమ్ము చేసుకున్నాడని ఆరోపించారు. ఆ వెంచర్‌లో ఎక్కడా కూడా పదిశాతం భూమి కేటాయించలేదన్నారు. సర్వేనెంబరు 746/ఈ/1లో ఆరెకరాల అక్రమ వెంచర్ ప్లాట్లను విక్రయించిన అదే భూమికి 2018 నుంచి 2023వరకు రైతుబంధు రూ.30వేల చొప్పున మధు తీసుకుంటున్నాడని తెలిపారు. అదేవిధంగా, కల్వకుర్తి పట్టణంలో సర్వే నెంబరు 54/యులో అఖిలబేగం 2009లోలేఅవుట్ పర్మిషన్ తీసుకుని 1400గజాలను గ్రామపంచాయతీకి కేటాయించారు. అట్టి గ్రామ పంచాయతీ 1400గజాల ప్లాట్లను అనుసరించి కేశవనగర్ వెంచర్‌ను మధు ఏర్పాటు చేశారని తెలిపారు. పంచాయతీకి కేటాయించిన 1400గజాల ప్లాట్లను సైతం విక్రయించి సొమ్ము చేసుకున్నాడని కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు ఆరోపించారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తి, మార్చి 5 : కల్వకుర్తి పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవా రం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉద యం 5గంటల నుంచి దేవా లయంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సుప్ర భాతం, పంచామృతాభిషేకం, గణపతిపూజ, భగవద్గీత పా రాయణం చేపట్టారు. సా యంత్రం స్వామి వారి ఎదు ర్కోళ్ల, కనుల పండువగా జరిగాయి. ఆలయంలో భక్తు లకు విశాల వసతులు ఆల య ఫౌండర్ ట్రస్టీ కల్వ మనోహర్, నాయకులు కల్పించారు.


ఈశ్వరుడిని దర్శించుకున్న జానపద సింగర్ నాగదుర్గ



ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసిన సింగర్ నాగదుర్గ

అచ్చంపేట టౌన్, మార్చి 5 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వర క్షేత్రంలో మంగళవారం జానపద సింగర్ నాగదుర్గ ఈశ్వరుడ్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందారు సుధాకర్, అర్చకుడు వీరయ్య పూర్ణకుంభంతో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరుడికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి, అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్‌లు ఆలయ చరిత్రను ఆమెకు వివరించారు. ఆమె "జిల్లెలమ్మ జిట్ట, కాపోళ్ళ ఇంటికాడ, తిన్నతిరం పడుతలే".. వంటి ఎన్నో జానపద పాటలు పాడారు. అదేవిధంగా కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులు పెద్దఎత్తున ఉమామహేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కు సన్మానం



బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తి, మార్చి 5 : నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అధిష్ఠానం కల్వకుర్తి జడ్పీటీసీ సభ్యుడు పోతుగంటి భరత్ ప్రసాద్‌ను ప్రకటించింది. మంగళవారం ఢిల్లీ నుంచి ఎంపీ పోతుగంటి రాములుతో కలిసి భరత్‌ప్రసాద్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను, ఎంపీ పోతుగంటి రాములును పలువురు నాయకులు, అభిమానులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు.

'సమగ్ర వ్యవసాయంతో రైతులకు లాభాలు'

బిజినేపల్లి, మార్చి 5 : సమగ్ర వ్యవసాయం చేపడితే రైతులకు ఏడాది పొడువున ఆదాయంతో లాభాలను ఆర్జించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సమగ్ర వ్యవసాయంపై రైతులకు శిక్షణ శిబిరం నిర్వహించి మాట్లాడారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రగతి, నాబార్డు డీడీఎం షణ్ముక చారి, కేవీకే శాస్త్రవేత్తలు రాజశేఖర్, శైలా, ఆదిశంకర్, రామకృష్ణ ఉన్నారు.

'పది' పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మన్ననూర్, మార్చి5: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి గోవింద రాజులు కోరారు. అమ్రాబాద్ , పదర మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. మన్ననూరులో పదోతరగతి ప్రీఫైనల్ పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎండీ షర్ఫొద్దీన్, మండల నోడల్ అధికారి సిద్దార్థ మహదేవ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరుకైన గదుల్లో ఇక్కట్లు



పశువైద్యశాలలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- రికార్డులు భద్రపరిచేందుకూ స్థలాభావం - అధికారుల విధి నిర్వహణకు ఆటంకం
- కనీస వసతులు లేక ప్రజల అవస్థలు

చిన్న మండలాల ఏర్పాటుతో అక్కడి ప్రజలు సంతోష పడ్డారు.. తీరా ప్రభుత్వ పరిపాలన వ్యవస్థకు సౌకర్యాలు కల్పించకపోవడంతో నిరాశ చెందుతున్నారు.. ఇది ఎక్కడో కాదు ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందిన ఊర్కొండ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇరుకైన గదుల్లో.. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఇందులో అధికారుల విధులకు ఆటంకాలు.. అక్కడికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు లేక అవస్థలు ఎదురవుతున్నాయి. మన ప్రాంతం నుంచే జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మింపజేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఊర్కొండ, మార్చి 5: ఇరుకైన గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో అధికారులకు ఇబ్బందికరంగా మారింది. ఊర్కొండ మండల కేంద్రంలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు కార్యాలయాలకు వస్తుండగా, సౌకర్యాలు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉండేందుకు నిలువ నీడ లేక.. తాగేందుకు నీటి సౌకర్యం లేక నీరసించిపోతున్నారు. పశువైద్య శాలలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయడం, ఉన్న రెండు ఇరుకైన గదుల్లో అధికారులు పాలన కొనసాగిస్తున్నారు. రికార్డులు భద్రపరిచేందుకు కూడా స్థలం లేక అధికారులు కూర్చునే సీట్ల కిందనే వాటిని పెట్టుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. దాంతో పాటు గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయ నిర్వహణ కొనసాగుతుండడంతో పంచాయతీ అధికారులు కూర్చునేందుకు కూడా స్థలాభావం ఎదురవుతున్నది. ఇదే కార్యాలయంలో ఈజీఎస్ కార్యాలయ అధికారులు ఉండటం.. వారికి కూడా ఇక్కట్లు ఎదురవడం పరిపాటిగా మారింది. అదేవిధంగా స్థానిక అద్దె భవనంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతోంది. బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కూడా పోలీసు సిబ్బందికి స్థలం లేక ఇబ్బందిగా మారింది. రైతు వేదికలో వ్యవసాయ శాఖ కార్యాలయం కొనసాగుతోంది.

అలాగే, పాడుపడిన పాఠశాల భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నడుస్తోంది. వర్షం పడిందంటే నీటితో ఇబ్బంది కరంగా మారడం.. అలాగే, ఎండాకాలం అయితే రేకుల షెడ్ ఉండటంతో వైద్యసిబ్బంది ఇక్కట్లు అంతా ఇంతా కాదు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఉమ్మడి మిడ్జిల్ మండలంలో నుంచి విభజన జరిగి ఊర్కొండగా మారడం.. 2006 సంవత్సరంలో జడ్పీటీసీ సభ్యుడిగా ఈ మండలం నుంచే గెలుపొందారు. ఇలాంటి మండలంలోనే ప్రభుత్వ కార్యాలయాలు దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటికి సొంత భవనాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోలేదు.. ఈ ప్రభుత్వమైనా తగిన చర్యలు తీసుకుంటే ఇటు అధికారులకు, అటు ప్రజలకు ఇబ్బందులు తొలగే అవకాశం లేకపోలేదు.

స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో భద్రపర్చేందుకు స్థలం లేక కింద పడేసిన రికార్డులు

ఇరుకైన గదుల్లో ఇబ్బందులు ఎదుతున్నాం



గత ప్రభుత్వం చిన్న మండలాలు ఏర్పాటు చేయడంతో చాలా సంతోషపడ్డాం. ఇరుకైన గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా ప్రాంతం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.. ఆయన ఈ ప్రాంతంపై దృష్టి సారిస్తే బాగుంటుంది. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కంటం రాములు, ఊర్కొండ

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి సెక్టోరల్ అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియామవళిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

సెక్టోరల్ అధికారులు భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ పూర్తై ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌కు తీసుకొచ్చే వరకు పూర్తి బాధ్యత మీదే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం సెక్టోరల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయాలపై నివేదికను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల మార్గదర్శకాలు నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, సంబంధిత అధికారులకు కేటాయించిన విధులు, నియమ నిబంధనలను తూచ తప్పక పాటిస్తూ క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు తగిన సమాచారం అందించాలని చెప్పారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల సదుపాయాలపై తగిన నివేదిక ఇవ్వాలని ముఖ్యంగా తాగునీరు, ర్యాంపు, ఫర్నీచర్, విద్యుత్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ సీఈవో ట్రైనర్ గోపాల్‌నాయక్ సెక్టోరల్ అధికారులకు ఎన్నికల్లో వారు నిర్వహించాల్సిన అంశాలపై శిక్షణ అందించారు. ఈ శిక్షణా తరగతుల్లో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, ట్రైనర్ గోపాల్‌నాయక్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్

శివనామ స్మరణతో మారుమోగుతున్న నల్లమల

దోమలపెంట, మార్చి 5 : నల్లమల కొండల్లో కొలువుదీరిన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు శ్రీశైలానికి తండోపతండాలుగా తరలివస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు కొందరు శివమాలతో, మరి కొంత మంది పాదయాత్రగా వెళ్తున్నారు. వారం రోజుల నుంచి నల్లమల ప్రాంతం శివనామ స్మరణతో మారుమోగుతోంది. పాదయాత్ర చేసే భక్తులతో శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి రద్దీగా మారింది. ముఖ్యంగా మన్ననూర్, వటువర్లపల్లి, దోమలపెంట, పాతాళగంగ గ్రామాలు శివస్వాములు, భక్తుల సందడితో కళకళలాడుతున్నాయి.

అలాగే, భక్తుల ఆకలి దప్పికలు తీర్చేందుకు దాతలు అన్నదానం చేస్తుండగా, అచ్చంపేట వారు శివ సన్నిధి సేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు, తాగునీరు అందిస్తున్నారు. కార్యక్రమంలో సురేశ్, మహేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, వినోద్ తదితరులున్నారు.



వటువర్లపల్లిలో సేద తీరుతున్న శివస్వాములు

పట్టణం మొత్తం శివమయం

- శివస్వాములకు అల్పాహారం అందిస్తున్న పట్టణ వాసులు

అచ్చంపేటటౌన్, మార్చి 5: ఉదయం, సాయంత్రం అయిందంటే అచ్చంపేట పట్టణ ప్రధాన రహదారి మొత్తం శివస్వాములతో సందడిగా మారుతున్నది. శివనామస్మరణ స్మరిస్తూ పాదయాత్రగా స్వాములు శ్రీశైలం వెళుతున్నారు. పట్టణంలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన అల్పాహారం, అన్నదాన కేంద్రాల వద్ద మధ్యాహ్న సమయంలో భిక్ష తీసుకొని స్వాములు సేద తీరుతున్నారు. కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఈ మార్గంలోనే పెద్ద ఎత్తున శివస్వాములు వెళ్తుంటారు. ఈ ఏడాది గత 3రోజులుగా శివదీక్ష తీసుకున్న స్వాములు పెద్ద తరలివస్తుడడంతో పట్టణం మొత్తం శివమయమయింది.

పట్టణంలోని రామ్ రహీం లోకల్ ఆటో యునియన్, భక్తమార్కండేయ ఆలయ కమిటీ, లారీ అసోసియేషన్‌తో పాటు పలువురు శివస్వాములకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



కల్వర్టుపై అరటిపండ్లు తింటున్న చిన్నారి స్వాములు



సాయంత్రం పాదయాత్ర ప్రారంభించిన స్వాములు

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

తిమ్మాజిపేట, మార్చి 5: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించడం తప్పనిసరి అని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జీవీ.రమేష్ సూచించారు. తిమ్మాజిపేట మండలంలోని అప్పాజీపల్లి, గొరిట, ఆవంచ గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలను నిర్వహించి 785పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జీవీ.రమేష్ గొరిట గ్రామంలోని పశువైద్య శిబిరాన్ని సందర్శించి గాలికుంటు వ్యాధి నివారణపై రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. గాలికుంటు వ్యాధి వైరస్ ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాప్తి చెందుతుందని జాగ్రత్తలు పాటించాలన్నారు. టీకాలు వేయించడం మరవద్దన్నారు. గ్రామాల వారీగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలన్నారు. అనంతరం పాడి పరిశ్రమను పరిశీలించి పాడి రైతులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు డాక్టర్ శివరాజ్, డాక్టర్ శ్రావణి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా నేత్ర వైద్య శిబిరానికిరండి

- మంత్రి సీతక్కను ఆహ్వానించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్, మార్చి 5: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ వారి సౌజన్యంతో ఈ నెల 9 నుంచి 17 వరకు నిర్వహించే ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి రావాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం కలిసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు తాను తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాచారం గ్రామ వాసి అనూష, ప్రాజెక్టు లిమిటెడ్ చైర్మన్ జలంధర్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి ఉన్నారు.



మంత్రి సీతక్కకు నేత్ర వైద్య శిబిరానికి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

కందనూలు, మార్చి 5 : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8న నాగర్‌కర్నూల్ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రయాణికులకు శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.దేవరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్యను పెంచుతామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు. ప్రయాణికులు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయకుండా టీఎస్ఆర్‌టీసీ బస్సుల్లోనే సురక్షితంగా గమ్యం చేరాలని డిపో మేనేజర్ కోరారు.

జైగౌడ ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడిగా గుండ్రాతి నారాయణగౌడ్



గుండ్రాతి నారాయణగౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న జైగౌడ ఉద్యమం వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టికూటి రామారావు

పెద్దకొత్తపల్లి, మార్చి 5 : జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గుండ్రాతి నారాయణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని జైగౌడ ఉద్యమం కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్లీనరీలో గుండ్రాతి నారాయణగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా తమటం వెంకటస్వామిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చుక్క వెంకటరమణగౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా సోమ ప్రగతిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి.శశికళగౌడ్, ఉపాధ్యక్షురాలుగా సింగారి జ్యోతిగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నిర్మల్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా దగడాల సుదర్శన్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జైగౌడ ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్‌కు ఉద్యమం వ్యవస్థాపక అధ్యక్షుడు వట్టికూటి రామారావు నియామక పత్రాన్ని అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, మార్చి 5 : మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన డ్రైవర్ చౌట బాలు మంగళవారం మొల్గర సమీపంలోని దుందుభి వాగు నుంచి ఇసుకను నడింపల్లికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఉప్పునుంతల పోషమ్మ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు భానుప్రకాశ్‌రెడ్డి, రాములు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ చౌట బాలుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుజ్ఞానం తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిజినేపల్లి, మార్చి 5 : మండలంలోని మంగనూరు గ్రామంలో రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మానపాడు సైదులు రేషన్ లబ్ధిదారుల నుంచి దాదాపు ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో దాచి ఉంచాడు. పక్కా సమాచారంతో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ రాంమోహన్‌తో కలిసి తనిఖీ చేశామన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని బిజినేపల్లిలోని రేషన్ డీలర్ నాగమణికి అప్పగించి, సైదులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలి

ఉప్పునుంతల, మార్చి 5: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేపట్టిన నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జప్తిసదగోడు గ్రామంలో ఉన్న నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవిలో మొక్కలకు ఎక్కువసార్లు నీళ్ల పట్టాలని ఆయన సూచించారు. కవర్లలో ఎండిపోయిన మొక్కల స్థానంలో విత్తనాలు త్వరితగతిన నాటాలన్నారు. ఆయన వెంట ఏపీవో సుదర్శన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

వంగూరు, మార్చి 5: మండలంలోని డిండిచింతపల్లిలో మృతి చెందిన అంజనమ్మ కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రం, రాజశేఖర్, తిరుపతయ్యలు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారు కోరారు.

కరపత్రాలు విడుదల

వంగూరు, మార్చి 5: మండల కేంద్రంలో మంగళవారం రాయలగండి చెన్నకేశ్వరస్వామి ఉత్సవాల కరపత్రాలను మాలమహానాడు సంఘం నాయకులు విడుదల చేశారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అంతయ్య, తిరుమలయ్య, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

కోడేరు, మార్చి 5 : మండల కేంద్రంలో ఈ నెల 7 నుంచి 9వరకు మూడు రోజుల పాటు ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు ఆలయ అర్చకుడు జంగం శివయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన పల్స్ పోలియో

కోడేరు, మార్చి 5 : మండలంలో మూడు రోజుల పాటు కొనసాగిన పల్స్‌పోలియో మంగళవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 3,998చిన్నారులకు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తమ సిబ్బందితో ఇంటింటికి తిరుగుతూ వంద శాతం చుక్కలు వేసినట్లు డాక్టర్ దశరథం తెలిపారు.

ఘనంగా శివస్వాముల ఇరుముడి



కోడేరులో ఇరుముడి కార్యక్రమం

కోడేరు, మార్చి 5 : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శివస్వాములు మంగళవారం ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. శివస్వాములు ఆయా దేవాలయాల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం వేళల్లో గ్రామాల్లో పురవీధుల్లో తిరుగుతూ భజన సంకీర్తనలతో పాటు ఆట పాటలతో స్వాములు శ్రీశైలానికి బయల్దేరారు. భక్తులకు మైనార్టీ నాయకులు నయీమ్, మాసుమార్‌బాబాలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అర్చకుడు జంగం శివయ్య తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు

పెద్దకొత్తపల్లి, మార్చి 5 : బాల్య వివాహం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల శారీరక, మానసిక వేధింపుల గురించి విద్యార్థినీ విద్యార్థులకు చైల్డ్‌లైన్ కవిత, మల్లీశ్వరిలు అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని సాతాపూర్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి

కల్వకుర్తి, మార్చి 5 : ఓటు హక్కు నమోదు, వినియోగంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంజేపీ బీసీ బాలుర గురుకులం ప్రిన్సిపాల్ వేంకటేశ్వర్లు అన్నారు. కల్వకుర్తి మండలంలోని ఎంజేపీబీసీ బాలుర గురుకులంలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం, ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన జరిగింది. ఈ సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, బాధ్యతగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రభుత్వ నిర్మాణంలో ప్రముఖ పాత్ర ఉంటుందన్నారు. ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్, నాయకులు గణేష్, ఉపాధ్యాయులు నాగరాజు, కృష్ణ, నరసింహ, నిర్మల, గణేష్ ఉన్నారు.

బకాయి డీఏలను వెంటనే విడుదల చేయాలి

కందనూలు, మార్చి 5 : ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న మూడు పెండింగ్ డీఏలను తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాముడునాయక్ ప్రభుత్వానికి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.